# సోమ్నాంబులిస్ట్



"నేనే జోకుల వెంకన్నని!"

"అవును, నేనే జోకుల వెంకన్నని!"

గదిలో పడుకున్న పాప నిద్రలో ఉలిక్కిపడి లేచింది. మూడు రోజుల క్రితమే, తమ పక్కన ఖాళీగా ఉన్న గదిలో అద్దెకు దిగిన అందమయిన అబ్బాయి అర్ధరాత్రి వేళ అలా గట్టిగా కలవరించడం చూసి ఉలిక్కిపడింది.

తన పక్కనే పడుకుని, నిద్ర పట్టక దొర్లుతున్న సత్యవతిని తట్టి, "ఎవ రీ సోమ్నాంబులిస్ట్" అంది.

"ఎవరో నువ్వే చెప్పావుగా? ఇక వేరే వివర మెందుకు?" అంది సత్యవతి.

"వెధవ నిద్ర జోకులు జోకక అత డెవరో, ఏం చేస్తున్నాడో చెప్పు" అంది.

"ఎస్. బి. ఐ. లో ఉద్యోగం వెలగ బెడుతున్నాడట. రాత్రి తొమ్మిది గంటల దాకా 'ఓ. టి.' చెయ్యడం, వచ్చి పడుకుని కలవరించడం. అతను వచ్చిన రోజు రాత్రే 'షార్ట్! షార్ట్!' అని కలవ రించాడు. మేం హార్టేమోనని కంగారు పడ్డాం. మరునాడు అన్నయ్య చెప్పాడు— అతనికి ఆ రోజు రెండు వందలు షార్ట్ వచ్చిందిటని. ఇంకో విశేషం. నిద్రలో ఒకోసారి లేచి అలాగే నడిచి వెళ్ళిపో తుంటాడట. మేం చూడలేదనుకో. అతనుమాత్రం ఆ విషయం ఇంట్లో దిగే ముందు అన్నయ్యతో చెప్పి, 'తను అలా నిద్రలో ఎక్కడి కయినా వెళ్ళినా మీరు కంగారు పడకండి' అని చెప్పాడట. అన్నయ్య 'మరి ట్రీట్‌మెంటు తీసుకో రాదా!' అంటే, అంతకు ముందు రోజే డాక్టర్ దగ్గరకు వెళ్ళాననీ, ఓ నెల రోజులు ట్రీట్‌మెంటు తీసుకోవాలని డాక్టరన్నాడనీ అన్నయ్యతో చెప్పినట్లు అన్నయ్య నాకు చెప్పాడు" అంది సత్యవతి.

"కుర్రాడు బాగానే ఉన్నాడు, చూశావుగా?"

"చూశాను, చూశాను. నువ్వీ వేళే వచ్చావుగా? ఇంకా చూడ్డవుగాని కంగారు పడక" అంది సత్యవతి.

పాప విసుక్కుంది. విసుక్కున్నాక పడుకుంది.

* * *

ఆ ఇల్లు పాప నాన్నదే. కాని, ఆ ఇంట్లో వాళ్ళ మేనత్త ఉంటుంది. సత్యవతి పాప మేనత్త కూతురు. బి. ఎ. ఫైనల్ వ్రాసి సరదాగా ఆ ఊరు వచ్చింది పాప.

మరునాడు బావ బాబ్జీ దగ్గర వివ రాలు సేకరించింది పాప.

ఆ వివరా లివి. "అతని పేరు వెంకన్న. బాంక్‌లో కాషియర్ ఉద్యోగం. ఇంకా పెళ్ళవలేదు. బాబ్జీకి పరిచయమయ్యాక మంచివాడని ఆ కుర్రాణ్ణి తమ ఇంట్లో రూములోకి అద్దెకు రానిచ్చాడు. అతను సోమ్నాంబులిస్ట్, మనవాడే."

ఆఖరి మాటతో ఉలిక్కిపడిన పాప "నీ కెలా తెలుసు?" అంది. "అతను చెప్పాడు గనక" అని జవాబిచ్చి పాళ్ళావిడకి ఉత్తరం పోస్ట్ చెయ్యాలంటూ వీధిలోకి జారుకోబోయాడు.

"ఆగు, బావా! రాత్రి 'జోకుల వెంక న్నని' అంటూ కలవరించాడే మరి? జోకుల వాళ్ళింటి పేరా?" అనడిగింది పాప.

"కాదు, మరదలా, కాదు. అతను పనిచేసే బాంక్‌లోనే 'విట్స్‌క్రాసు' అనే వాడున్నాడు ..."

"విట్స్‌క్రాసా! అదేం పేరు?"

"అదికూడా బాంకు జనావళి ఇచ్చిన బిరుదే. అతను మంచి 'విట్సు' వేస్తుం టాడని, అతని పేరు 'విఠల్‌రావు'ని 'విట్స్‌క్రావు' అని మార్చారు. అంతటి విట్స్‌క్రావూ వెంకన్న జోకులకి ఆకులా అయిపోయి 'జోకుల వెంకన్న' అని ఓ

సెక్రటరీ- అధ్యక్షులవారేమో ఆగష్టు పదహేనన్నారు-
ఇంతకూ స్వాతంత్ర్యమొచ్చిందెప్పుడూ!



తలుపు వేసేసుకున్నాడు.

పాప నిర్ఘాంతపోయింది.

* * *

ప్రొద్దున్నే హుషారుగా నిద్రలేచి పెరట్లో కెళ్ళిన పాపకు నూతి దగ్గర మొహం కడుక్కుంటున్న వెంకన్న పాపను చూసి పలకరింపుగా నవ్వి, టవల్‌తో మొహం తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

తరవాత తీరికగా బాబ్జీ వెళ్ళిపోయాక సత్యవతిని మెల్లిగా కబుర్లలోకి దింపింది పాప.

"వెంకన్న గారికి ఎవరూ లేరా, పాపం. హోటల్లో తింటాడు" అంది పాప.

సత్యవతి ఓ సారి పాప ముఖంలోకి చూసి నవ్వి, "ఎవరూ లేకేం? హోటల్లో తినేవాళ్ళంతా దిక్కుమాలిన వాళ్ళనా నీ అభిప్రాయం" అంది.

"అబ్బే, అదేంకాదుగానీ ..." అంటూ రాత్రి జరిగిందంతా ఒక మాట కూడా దాయకుండా సత్యవతికి చెప్పింది పాప.

చెప్పాక "నీ అభిప్రాయం సెల విమ్మని ఏా మనవి" అంది పాప. "నేను కుంటే బాగుంటుం దంటావా" అని కూడా అంది.

"నీ కిష్టమయ్యాకా నేను వద్దంటే మాత్రం నువ్వు మానేస్తావా, ఏమన్నానా! అని, "వెంకన్నగా రింకా బాంకు కెళ్ళలేదు. మెల్లిగా పిలుచుకొస్తాను. ఏ సంగతీ అడిగేద్దాం. అయినా, నీతో రాత్రి అన్నా డన్నావు కాబట్టి అది లెక్కల్లోకి రాదు. కారణం నీకూ తెలుసు. అతను సోమ్నాం బులిస్ట్" అంది సత్యవతి. వెంకన్న కోసమని వీధి గుమ్మంలోకి వచ్చిన సత్యవతికి వెంకన్న గుమ్మంలో నిలబడి కనిపించాడు.

సత్యవతిని చూడగానే సిగ్గుపడు తున్నట్టుగా నవ్వాడు. పాప గురించి చెప్పడానికి సిగ్గుపడుతున్నా డనుకుంది సత్యవతి.

"బాబ్జీగా రున్నారండీ? నిన్ననే ఇద్దా మనుకున్నాను. కానీ, నిన్న మంగళవారం అని తియ్యలేదు. 'అఫ్‌కోర్స్' బాబ్జీకి ముందే తెలుసనుకోండి. మీకు చెప్పే ఉంటాడు."

తలుపు చాటున సిగ్గుగా నిలబడ్డ పాప బుర్ర పనిచెయ్యడం మానేసింది. 'బాబ్జీ బావకు కూడా చెప్పేశాడా ఏమిటి!' అనుకుంది.

సత్యవతికీ మతి పోయింది గాని కంగారుపడలేదు.

"వచ్చే శనివారం రాత్రి నా పెళ్ళి. అన్నవరంలో. మీరు తప్పకుండా రావాలి. మా మేనమామ కూతురేలెండి. ఇదుగో శుభలేఖ. మీ ఇంట్లో మీ చుట్టం అమ్మాయిని నిన్న పరిచయం చేశారు— చూడండి, ఆవిడ పూర్తి పేరు చెప్పండి. వేరే కార్డు రాసి ఇస్తాను" అంటూన్న వెంకన్నని చూసి, అలాగే తలుపువెనకాలనిలబడఉన్న పాప "సోమ్నాం బులిస్ట్!" అంది పళ్ళు పటపటా కొరుక్కొంటూ. ★